## క్లుప్తంగా

### నేడు చించినాడలో గడపగడపకు మన ప్రభుత్వం

యలమంచిలి: మండలంలోని చించినాడ గ్రామంలో సోమవారం ఉదయం 7 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు.. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

### ప్రమాదకరంగా వంతెన మార్గం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాధలో మంగళగుంటపాలెంకు వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ, ఇటూ కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. రోడ్డు శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు ప్రతి రోజూ పడిపోతున్నారని స్థానికులు చెప్తున్నారు. ఎంతో కాలంగా, ఈ వంతెన మార్గంవైపు రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

### 11న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

పెనుగొండ: చివటం సత్యనారాయణ నాగరత్నం స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 11న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చివటం సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పార్కు వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు షీల్డ్‌లతో పాటు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు నగదు, రెండో బహుమతిగా రూ.2 వేలు నగదు, మూడో బహుమతిగా రూ.1000 నగదు, కన్సోలేషన్ బహుమతులు ఇద్దరికి రూ.500 వంతున ఇస్తామన్నారు. పోటీలకు ఎలాంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన వివరాలకు 98495 28590 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన



పులపర్తివారితోటలో భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న భక్తులు

మొగల్తూరు: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి సభ్యులు కోరారు. ఆదివారం మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోటలో ఇంటింటికి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండారు సత్యనారాయణ, సుబ్బారావు, బ్రహ్మాజీ, చంటి, వెంకట కృష్ణ, శ్రీను, సత్యవతి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### పెనుగొండ విద్యార్థుల ప్రతిభ




డీఎస్పీ, సబ్ కలెక్టరు చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున విద్యార్థులు

పెనుగొండ: పాలకొల్లులో నిర్వహించిన జోనల్ స్థాయి గరల్స్ ఇంట్రాజోనల్ స్పోర్ట్స్ మీట్‌లో పెనుగొండ విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని పెనుగొండ భాష్యం ప్రిన్సిపాల్ ఎస్.వెంకట అప్పారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1200 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో కోకో, టెన్నీస్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, 100 మీటర్ల రన్నింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు బహుమతులు సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ, డీఎస్పీ కె.రవిమనోహర్ తదితరులు అందించారు.

### కోడిపందేల స్థావరంపై దాడి

పాలకోడేరు: మండలంలోని మోగల్లు పంచాయతీ పరిధిలో ఉన్న గుత్తుల వారి పాలెంలో కోడిపందే లు నిర్వహిస్తుండగా ఆదివారం ఎస్సై సీహెచ్‌ఎస్ రామచంద్రరావు తన సిబ్బందితో దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.3,150 నగదు రెండు కోళ్లు రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

# అన్ని వర్గాలకూ అండగా సీఎం జగన్

మాజీ మంత్రి రంగనాథరాజు



పెనుమంచిలిలో సీతారామ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఏ ఒక్క వర్గానికి అన్యాయం చేయకుండా రాష్ట్రంలో అన్ని వర్గాలకు రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం ఆచంట మండలం పెనుమంచిలిలో నిర్మించనున్న సీతారామ మండపానికి శంకుస్థాపన చేశారు. గతంలో చంద్రబాబు వర్గ విభేదాలు రెచ్చగొడుతూ కొన్ని వర్గాలపై వివక్ష చూపేవారన్నారు. అంతే కాకుండా, జన్మభూమి కమిటీల పేరుతో కొందరికే సంక్షేమాన్ని అందించే వారన్నారు. నేడు సీఎం జగన్ అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థతో పారదర్శక పాలన అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై టీడీపీ బురద జల్లుతూ దుష్ప్రచారం చేస్తుందన్నారు. వలంటీర్లకు ప్రజల నుంచి అందుతున్న ప్రశంసలు చూసి ఓర్వలేకపోతుందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని పాదయాత్రలు చేసినా రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో పెనుమంచిలి సర్పంచ్ గణేషుల శేషవేణి సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, భీమలాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మొల్లేటి రామకృష్ణ, దేవి రెడ్డి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు ఆకుమర్తి వెంకటలక్ష్మీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా ప్రేమ్‌కుమార్, ముత్యాల నాగేశ్వరావు, ముప్పాళ వెంకటేశ్వరరావు, మంగెన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



లోపింటి చిరంజీవి మెడలో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం తూర్పు కాపు సంఘ రాష్ట్ర నాయకుడు లోపింటి చిరంజీవితో పాటు సుమారు 100 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలో కష్టించి పని చేసిన కార్యకర్తలు, నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యత వహించాలని కోరారు. ఇటీవల నియమితులైన వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో లోపింటి శ్రీనివాసరావు, అలిగి పాండురంగారావు, తాళా దిలీప్ కుమార్, చాన్ పాషా, ఇప్పిలి మణికంఠ, లోపింటి గణేశ్వరరావు, దాసెట్టి రమణ, పైపుల రాజేష్, ఏకల సుందరయ్య, కొండ్రెంగి మునేశ్వరరావు, దుపాడ బాలాజీ, టి దుర్గాజీ, జామ వెంకటేశ్వరరావు, అట్టాడ నవీన్‌లో వైఎస్సార్ సీపీ చేరిన వారిలో ఉన్నారు. వీరిని చింతలపూడి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుణ్ణం నాగబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీటీడీసీ బాబు, సచివాలయ పట్టణ కన్వీనర్ ఎంఎస్ వాసు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, పెదగోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాస్, జమ్ము ముత్యం, గేదెల శ్రీనివాస్, గెద్దా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**జెడ్పీ చైర్మన్ కవురు పరామర్శ**

యలమంచిలి: మేడపాడు మాజీ సర్పంచ్ అద్దాల మోహనరంగ ప్రసాద్ గత నెల 31న మరణించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఆదివారం మేడపాడు వెళ్లి రంగప్రసాద్ కటుంబ సభ్యులతోపాటు ఆయన సోదరుడు మాజీ సర్పంచ్ వాసుదేవరావును పరామర్శించారు. అనంతరం రంగప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, నాయకులు గంధం సత్యకీర్తి, ఉచ్చుల స్టాలిన్, కల్యాణం గంగాధరరావు, దొంగ విజయ్‌కుమార్, డేగల వెంకటేశ్వరరావు, గాది వరదయ్య, ఉండ్రాజవరపు ఆంజనేయులు, కుక్కల బాలచంద్రన్ తదితరులు ఉన్నారు.

# సూర్యభగవానుడికి క్షీరాభిషేకం





జుత్తిగలో సూర్యదేవాలయం ఎదుట సూర్యనమస్కారాలు చేస్తున్న భక్తులు ,జుత్తిగ గ్రామంలోని సూర్యదేవాలయం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు. →

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలోని శ్రీఉమావాసుకి రవిసోమేశ్వరస్వామివారి ఆలయ ఆవరణలో ఆదివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని సూర్యభగవానుడికి క్షీరాభిషేకం, పంచామృత రుద్రాభిషేకాలు నిర్వహించారు. పార్వతిదేవి, దుర్గాదేవిలకు కుంకుమార్చనలు చేశారు. ఉదయాన్నే పెద్ద ఎత్తున మహిళలు సూర్యభగవానుడి ఆలయం ఎదుట సామూహిక అభిషేకాలు నిర్వహించిన అనంతరం అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం సోమేశ్వరస్వామి, సూర్యనారాయణ మూర్తి, పార్వతి, దుర్గాదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ర్యాలి వాసుశర్మ, గణేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ధ్యానం వల్ల విశేషమైన ప్రాణశక్తి

మొగల్తూరు: పౌర్ణమి రోజుల్లో ధ్యానం చేయడం వల్ల విశేషమైన ప్రాణశక్తిని పొందవచ్చని జిల్లా పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీ అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ తెలిపారు. కేపీపాలెం తీరంలో ఉన్న పాండరంగ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన పౌర్ణమి ధ్యానం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా నిండు పౌర్ణమి దినాల్లో విశ్వ శక్తి ఎక్కువుగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత ధ్యాన కళారత్న పిప్పళ్ళ ప్రసాదరావు బృందం వారి సంగీత నాద కచేరీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అందే వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అందే ముక్తేశ్వరరావు, కళ్లెం రామిరెడ్డి, కేవీడీ ప్రసాద్, అందే సత్యనారాయణ, తోట సత్యనారాయణ, వి.సాయికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి మానవత చేయూత



ఆర్థిక సహాయం అందిస్తున్న మానవతా సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఉన్నత విద్య చదవడం కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థికి మానవతా సేవా సంస్థ ఆర్థిక సహకారం అందించింది. మానవతా సంస్థ చైర్మన్ ముత్యాల రామారావు మాట్లాడుతూ యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి వాతాడి సాయి కుమార్ పాండిచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నాడు. అతని చదువుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవ్వడంతో మానవతా సేవా సంస్థ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థి సాయికుమార్‌కు రూ. 10 వేలు ఆర్థిక సహకారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా సెక్రటరీ షేక్ పీర్‌సాహెబ్, ఆత్మీయ కమిటీ చైర్మన్ ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఆలయ వార్షికోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: స్థానిక మెయిన్‌రోడ్డులో ఊరచెరువుగట్టుపై ఉన్న శ్రీవరసిద్ధి వినాయక ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉదయం గోపూజ, గణపతి హోమం, పంచామృతాభిషేకం అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి ఉత్సవ విగ్రహాలతో ప్రత్యేక రథంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మేళతాళాలు, బుట్టబొమ్మలు, భేతాళ నృత్యాల ప్రదర్శనలతో బాణసంచా కాలుస్తూ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమిల్లి గోపాలరెడ్డి, వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, తుంపూడి విజయ్‌కుమార్, యర్రా రాధేగోపాల్, రావు అంజిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# జానపద కళలను ప్రోత్సహించాలి



పెదగోపురంలో జానపద కళాకారులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: అంతరించిపోతున్న జానపద కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలపైనా ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ క్షీరారామ లింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం బుర్రకథ కళాకారులను సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేసే ప్రాచీన కళలైన బుర్రకథ, హరికథలను ప్రోత్సహించాలన్నారు. బుర్రకథ కళాకారులు యడవల్లి దుర్గాప్రసాద్, యడవల్లి సుభద్రమ్మ, నక్కా రామారావు, కృష్ణమూర్తి, షేక్ ఖాదర్‌వల్లి, కంజరి కథకుడు కారెం శ్రీనివాస్‌లను శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. రోటరీ సభ్యులు కావలి నగేష్, కానూరి ప్రభాకర్, గొర్ల శ్రీనివాస్, శ్యాంబాబు, చిలుకూరి భీమన్న, ముత్యాల శ్రీవాత్సవ, కేసీహెచ్ పెద్దిరాజు, అజయ్‌బాబు, యాతం రమేష్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ, పల్లాలమ్మకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రులో ఉన్న గ్రామదేవత ముత్యాలమ్మ, పల్లాలమ్మ అమ్మవార్ల ఆలయంవద్ద భక్తుడు దారాబత్తుల హరిసాయి మొక్కుబడులు చెల్లించుకుని అన్న సమారాధనను నిర్వహించారు. కుంకటి శ్రీరామూర్తి ప్రతిష్ఠించిన శీతల మాత అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

### వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠ



సిద్ధాంతంలో ప్రతిష్టించిన విగ్రహాలు

పెనుగొండ: సిద్ధాంతం చింతలపాలెం శెట్టి బలిజ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం కోదండ రామస్వామి సీతా లక్ష్మణ స్వామి వార్ల విగ్రహ పునః ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. హోతా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేద పండితులు బొక్క వెంకటేశ్వలు చంద్రావతి, కవురు రవి (కిట్టయ్య) యశోధ లక్ష్మీ దంపతులు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నల్లపరాజు వేణుగోపాలకృష్ణ ఆదినారాయణ రాజు(దొరబాబు), గ్రామ సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), ఉండవల్లి సత్యనారాయణ(చిన్ని), కవురు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జగన్ పాలనలోనే క్రైస్తవులకు గౌరవం

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలోనే క్రైస్తవులకు సరైన గౌరవం లభిస్తుందని వైఎస్సార్ సీపీ క్రిష్టియన్ మైనారిటీ రాష్ట్రాధ్యక్షుడు మేడిద జాన్సన్ అన్నారు. ఆదివారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్చ్ సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు, కార్యదర్శి, స్త్రీల సమాజం,యూత్ ప్రతినిధులు జాన్సన్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పేరిష్ పాస్టర్ రెవరెండ్ వి.నెహ్రూ, అడిషనల్ పాస్టర్ బి.డేవిడ్‌లివింగ్స్టన్, సీఆర్ డి.సునీల్‌కుమార్, ఆలమూరి శ్యాంబాబు, గుమ్మడి అమృతరావు పాల్గొన్నారు.

# సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం



మట్టిదిబ్బలతో దర్శనమిస్తోన్న లాకురోడ్డు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడీ. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి ప్లాట్‌పామ్ నిర్మించి రెయిలింగ్ ధ్వంసమైంది. కొండాలమ్మగుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ చోరుల పాలవుతోంది. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రోడ్డు పక్కన మట్టిదిబ్బలు దర్శినమిస్తున్నాయి. రోడ్డు వెంబడీ ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని రాయితీలు అందిస్తామని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు పట్టణంలోని 31వ వార్డు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వెనుక అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు శ్రీ మన్యం జగ్గమ్మ సత్రం తరపున నిత్యావసరాలు, వంట సామగ్రి, దుప్పట్లు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, శ్రీ మన్యం జగ్గమ్మ గారి సత్రం చైర్మన్ నంబూరు శ్రీ గంగా పవన్, ట్రస్టీలు కడలి రామలక్ష్మి, క్రొవ్విడి సూర్యనారాయణ, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, వార్డు ఇన్‌చార్జ్‌లు యడ్ల సత్యనారాయణ, ధనాల శ్రీనివాస్, ఉచ్చుల స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని మావుళ్లమ్మపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక రెండు రోజులు క్రితం నాలుగిళ్లు అగ్నిప్రమాదానికి గురికావడంతో నిరాశ్రయులైన కుటుంబాలకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ సహాయ సహకారాలు అందించారు. ఆదివారం బాధిత కుటుంబాలకు బట్టలు, బియ్యం, కంచాలు, గ్లాసులు, బిందెలు అందించారు. కార్యక్రమం ధనాల దుర్గమ్మ, ధనాల శ్రీను, యడ్ల సత్యనారాయణ, మేకా రాజు, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వడ్డికాసులు, జోగి వెంకటేశ్వరరావు, బెజ్జవరపు నాగరాజు, చెన్ను విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వ కలయిక



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మొగల్తూరు: స్థానిక పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో 1965–66వ సంవత్సరంలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పదవీ విరమణ చేసిన వారు, వ్యాపార రంగాలలో స్థిరపడిన వారు, ఇతర ప్రాంతాల్లో కుమారులు దగ్గర ఉంటున్నవారంతా కలుసుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. సుమారు 56 సంవత్సరాలు తర్వాత అంతా ఒకే చోటికి చేరడంతో ఆనాటి ముచ్చట్లను నెమరు వేసుకున్నారు. అప్పటి విద్యనందించిన ఉపాధ్యాయుల్లో ఒక్కరే అందుబాటులో ఉండటంతో ఆయనను ఘనంగా సన్మానించారు.

# సోమేశ్వరుని ఆలయంలో గోశాల ఏర్పాటు



జుత్తిగ సోమేశ్వరుని ఆలయంలో గోశాలలో గో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పెనుమంట్ర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జుత్తిగ గ్రామంలోని శ్రీఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు గోశాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొవ్వూరి రామకృష్ణారెడ్డి, వెంకట సత్యవతి దంపతులు స్వామివారికి తొలి గోదానం చేసి, గోశాలలో ప్రవేశింపజేశారు. టీటీడీ వేదపండితులు వేమూరి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో గుడిమెట్ల రామకృష్ణారెడ్డి జ్యోతి దంపతులు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు గో ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రతీ రోజు స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించేందుకు భక్తులు ఈ గోశాలను ఏర్పాటుచేసి, గోవులను సంరక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ర్యాలీ వాసుశర్మ, పవన్, సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి, మాజీ సర్పంచ్ వీరవల్లి నాగలక్ష్మి, రామకృష్ణ, నల్లిమిల్లి విజయకుమార్‌రెడ్డి, గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.